క్లుప్తంగా

ఎస్ఆర్‌కేఆర్‌లో జాతీయస్థాయి ఎఫ్‌డీపీ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కళాశాల డైరెక్టర్ జగపతిరాజు

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ బ్రాంచ్(సీఎస్‌డీ), ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్ సంయుక్త ఆధ్వర్యాన డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేటివ్ ప్రోడక్ట్ డెవలప్మెంట్ అనే అంశంపై ఈనెల 30 నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు నేషనల్ లెవెల్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీ కృష్ణంరాజు తెలిపారు. దీనికి సంబంధించి గురువారం కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు పోస్టర్‌ను విడుదల చేశారు. సీఎస్‌డీ హెడ్ డాక్టర్ ఎం.సురేష్‌బాబు మాట్లాడుతూ ఎఫ్‌డీపీ కో ఆర్డినేటర్‌గా డాక్టర్ ముదునూరి సురేష్ బాబు, కో కో ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి వ్యవహరిస్తారని చెప్పారు.

రైలు సర్వీసుల పునరుద్ధరణకు వినతి

భీమవరం (ప్రకాశంచౌక్): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్‌కు కొత్త రైళ్లు, పాత రైలు పునరుద్ధరణ కోరుతూ శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి వినతి పత్రాన్ని అందజేశారు. విశాఖపట్నం నుంచి కాశీ వెళ్లే రైలును నరసాపురం మీదుగా నడపాలని, భీమవరం నుంచి బెంగళూరుకు రెండు ఎక్స్‌ప్రెస్‌లను నడపాలని, అమరావతి ఎక్స్‌ప్రెస్ ప్రారంభం అన్నారు గానీ రైలు నడవడం లేదని, ఈ కాశీ ఎక్స్‌ప్రెస్‌ను రెండు రోజులకు ఒకసారి నడపాలని కోరారు. పాత రైళ్లు పునరుద్ధరించాలని, రాజమండ్రికి ప్యాసింజర్ రైలు నడపాలని కోరారు. డబ్లింగ్ లైన్ వేసి భీమవరం రైల్వే స్టేషన్ సుందరీకరణ చేసినప్పటికీ గూడ్స్ రైళ్లు ఎక్కువగా నడవడం వల్ల ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామని డీఆర్ఎంకు వివరించారు.

నేడు ఉండి నియోజకవర్గంలో పీవీఎల్ నర్సింహరాజు పర్యటన

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 5, 6 వార్డుల్లో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శుక్రవారం ఉదయం జరిగే శంకుస్థాపన కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పాల్గొంటారు. అనంతరం మండలంలోని అయిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రతినిధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తర్వాత 11 గంటలకు పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామ సచివాలయం-2 పరిధిలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో పీవీఎల్ పాల్గొంటారని, అనంతరం ఉండి మండలం పాందువ్వ గ్రామంలో 3వ రోజు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరవుతారని పేర్కొన్నారు.

వాకర్స్ సమావేశం

సాక్షి, భీమవరం: మారుతి నగర్ వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక పార్కు నందు నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి వలవల నర్సింహరావు వార్షిక నివేదికను సమర్పించారు. అసోసియేషన్ తరపున చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పి.రామమోహన్‌రావు, పి.సూర్యనారాయణ రాజు, జి.గణేష్, బి.బలరామ్, కడలి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్‌లోని ఎడ్వర్డ్ ట్యాంక్ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బుధవారం రాత్రి బాగానే ఉన్నాడని, తెల్లవారి చూసేసరికి చనిపోయి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు కాళ్ల మండలం సీసలి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించామని సీఐ అడబాల శ్రీను తెలిపారు. బంధువులకు సమాచారం ఇచ్చామని, వివరాలు తెలుసుకున్న తర్వాత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం అర్బన్: భీమవరం మండలం కొమరాడలో జరిగిన వైద్య శిబిరంలో మహిళ మెడికల్ రిపోర్టును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలో వృద్ధునికి వైద్య పరీక్షలు చేయిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



వీరవాసరం: మత్స్యపురిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు



ఉండి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



పాలకోడేరు: కొండేపూడిలో జరిగిన వైద్య శిబిరంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, చిత్రంలో ఎంపీపీ చంటి రాజు



ఆకివీడు: మండలంలోని కుప్పనపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యాన్ని పేదలకు చేరువ చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం భీమవరం మండలం కొమరాడ గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్య రంగంలో గత టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల్లో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విప్లవాత్మక మార్పులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చి వేల కోట్లు ఖర్చు చేస్తూ పేదలకు వైద్యాన్ని చేరువ చేస్తున్నారన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం, 108 సర్వీస్‌లతో వైద్య రంగంలో ఒక్క అడుగు ముందుకు వేస్తే తన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీలో 3,200 వ్యాధులను చేర్చడమే కాక 108 సర్వీస్‌లు, గ్రామాల్లో 104 వాహనాల ద్వారా 14 రకాల వైద్య పరీక్షలు, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ఇంటింటికీ వైద్య బృందం తిరిగి రోగులను గుర్తించి వైద్య సేవలు అందించడం. మళ్లీ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యం అందించి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి, సర్పంచ్ రాట్నాల రామకృష్ణ స్వామి, ఎంపీటీసీ సభ్యుడు మైనపు వెంకటేశ్వరరావు, రాట్నాల సత్యనారాయణ, కొప్పర్తి సత్యనారాయణ, సర్పంచ్‌లు కోళ్ల బాలకృష్ణ, జల్లా కొండయ్య, రాట్నాల నాగేశ్వరరావు, అల్లూరి రవికుమార్ రాజు, తోట భోగయ్య, తిరుమాని ధనంజయ రాజు, రాట్నాల నాగేశ్వరరావు, కోమటి రాంబాబు, నామన మహేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ ఉచిత వైద్యం

భీమవరం(ప్రకాశం చౌక్): జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో చిన్నాపెద్ద అందరికీ ప్రభుత్వం ఉచిత వైద్య సేవలు అందిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని పీఎస్ఎం గర్ల్స్ హైస్కూల్‌లో 19,20,21 వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ వృద్ధులు, విద్యార్థులకు దగ్గర ఉండి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కంటి సమస్యలు ఉంటే శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరాల్లో అన్ని రకాల వ్యాధులకు 14 పరీక్షలు చేయడంతో పాటు 120 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మున్సిపల్ కమిషనర్‌పై ఆగ్రహం

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీ లేకపోవడంపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించే మంచి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నిర్వహిస్తుంటే ఆయన ఫ్లెక్సీ లేకపోవడం ఏమిటని ఆమెపై మండిపడ్డారు. మరోసారి ఇలా జరిగితే ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య, కోడే యుగంధర్, నల్లం రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, గాదిరాజు రామరాజు, కట్టా రవి, ములపర్తి స్వామి, గంటా సుందర్‌కుమార్, పాలపర్తి జోనా, ముల్లి నర్సింహమూర్తి, మెంటే బలరాం, షేక్ రబ్బాని, ముత్యాల రామరావు, కోళ్ల బాలకృష్ణ మాదాసు రంగబాబు, భలే ఏసుబాబు, శేషాద్రి హరిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

కాళ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి రక్షణను ఇస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు స్పష్టం చేశారు. మండలంలోని ఎల్ఎన్ పురంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తానంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభకు నర్సింహరాజు ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ప్రజల చెంతకే అనుభవజ్ఞులైన వైద్యులను పంపి ప్రతి ఒక్కరికీ సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప పాలన దక్షుడని కొనియాడారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో వైద్య సేవలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, జిల్లా సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సత్యనారాయణ, ఉప సర్పంచ్ మైల శ్రీనివాస్, రుద్ర వెంకట్రావు, రుద్ర సూరిబాబు, పెనుమత్స ప్రసాద్‌రాజు, సాగిరాజు హరివర్మ, వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూరేళ్లూ జీవించాలనే..

ఉండి: రాష్ట్ర ప్రజలంతా పిల్లాపాపలతో నిండునూరేళ్లు సంతోషంగా జీవించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం ఉండి సచివాలయం 2 పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ రాజకీయాల కోసమో, ఓట్లు దండుకోవడానికో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాలు నిర్వహించడం లేదన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా దేవుని దయతో పాలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములంతా దీవించాలని, ఆయన రుణం తీర్చుకుంటూ మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని నర్సింహరాజు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గా మహంకాళి, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, రణస్తుల మహంకాళి, కమతం బెనర్జీ, బదుగు బాలాజీ, సూరవరపు వెంకటాచార్యులు, బి.రామకృష్ణ, చిట్టూరి రత్నరాజు, బొచ్చా అచ్చారావు, సిరికి ఎర్రయ్య, కన్నా సాహెబ్, రాయి సతీష్, వీరమల్లు మల్లేశ్వరరావు, గాంధీరాజు పాల్గొన్నారు.

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యానికీ భరోసా

ఆకివీడు: పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ కనబర్చే ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, ఎంపీపీ కఠారి జయలక్ష్మి అన్నారు. మండలంలోని కుప్పనపూడిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యం మీ ముంగిటే అందిస్తున్న ఒకే ఒక్కడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. డబ్బులిచ్చి కార్పొరేట్ ఆసుపత్రుల్లో మంచాలు కొనుగోలు చేసుకునే రోజులు పోయాయని వారు పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా ఎటువంటి రోగానికైనా శస్త్ర చికిత్సలు ఉచితంగా చేసి, వారి వెంట ఉండే సహాయకులకు కూడా భోజన వసతి కల్పిస్తున్న అందరివాడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. శిబిరంలో 950 మంది రోగులకు వైద్య సేవలందించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల అనురాధ, మాజీ సర్పంచ్ ముత్యాల శివన్నారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మెంటే లక్ష్మణరావు, దేవస్థానం చైర్మన్ నూకల సత్యనారాయణ, కఠారి కేశవరావు, పన్నాసి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట ఇచ్చిన జగనన్న మనల్ని మర్చిపోలేదు

పాలకోడేరు: మాట ఇచ్చిన జగనన్న మనల్ని మర్చిపోలేదని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ గుర్తు చేశారు. గురువారం మండలంలోని కొండేపూడి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్సీ శ్రీనివాస్ మాట్లాడుతూ మనందరం ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం అంతా ఆనందంగా ఉంటుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల కాలంలో ఎందరో పాలకులు, ఎన్నో పార్టీలు వచ్చాయి గానీ ఇలాంటి కార్యక్రమం ఎవరూ నిర్వహించలేదని అన్నారు. ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణ రాజు(చంటి రాజు) మాట్లాడుతూ కవురు శ్రీనివాస్ జెడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలో గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించి తోడ్పాటు ఇచ్చారన్నారు. కొణితివాడ పీహెచ్‌సీ వైద్యాధికారి తాళ్ల లక్ష్మీ అలేఖ్య మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం రోగులకు వరమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 750 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి వెంకట సత్యనారాయణ (చిన్న), వేంద్ర అగ్రహారం సర్పంచ్ కడలి విజయలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ చేకూరి రాజా నరేంద్ర కుమార్, మాజీ సర్పంచ్ బొక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్, కడలి నాగేశ్వరి, కటిక శ్రీదేవి,, నరేష్, ఆదాడ లక్ష్మీతులసి, కొండలరావు, పాలా శ్రీనివాస్, చింతపల్లి వెంకటేశ్వరరావు, గూడూరి గోవిందరావు, చింతపల్లి రామకృష్ణ, మోహన్‌రావు, పాలా సత్యనారాయణ, పాలా చిన్నా, ఎంపీటీసీలు కాటూరి శాంతకుమారి, కునాధ రాజు నాగలక్ష్మి, పెన్మత్స వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

వీరవాసరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు తెలిపారు. మత్స్యపురి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చేపట్టారని వివరించారు. ప్రతి ఇంటా వైద్య సిబ్బందితో సర్వే చేయించి, ఎవరికి ఏ వైద్యం అవసరమో గుర్తించి, వారికి ప్రత్యేక చికిత్సలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. మత్స్యపురి గ్రామ సచివాలయ పరిధిలోని సుమారు 550 మందికి పైగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, గొలగాని సత్యనారాయణ, పోలిశెట్టి సత్యనారాయణ, గూడూరి ఓంకార్, నూకల కనకారావు, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, కురెళ్ల కాశి, పి.జ్యోతి, సుజాత రాణి, దుర్గాప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలన్నింటినీ అభివృద్ధి చేస్తున్నాం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



కొమరాడలో సీసీ రోడ్లకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ప్రజల కోరిక మేరకు ప్రతి గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం కొమరాడ పంచాయతీ పరిధి గొర్లమూడి చర్చి వద్ద గురువారం సుమారు రూ.10 లక్షలతో నిర్మించనున్న రెండు సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో నాడు-నేడు పథకం ద్వారా సర్కారు పాఠశాలలు, పీహెచ్‌సీలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాక గ్రామాల్లో ప్రజల సేవలకు సౌకర్యార్థం సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఆర్‌బీకే కేంద్రాల నిర్మాణాలు చేపట్టామన్నారు. అలాగే సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ప్రజల కోరిక మేరకు నిర్మిస్తున్నట్లు చెప్పారు. తీర ప్రాంత గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు సుమారు రూ.20 కోట్లతో జల జీవన్ మిషన్ ద్వారా పైపులైన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న 3 వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణాలకు రూ.36 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. తాడేరు వద్ద రూ.2 కోట్ల 36 లక్షలతో గునుపూడి సౌత్‌పై వంతెన నిర్మించామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అమ్మఒడి, రైతు భరోసా, డ్వాక్రా రుణమాఫీ, సున్నా వడ్డీ, పింఛన్ పెంపు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ ఇలా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి పాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సర్పంచ్ రాట్నాల రామకృష్ణ స్వామి, ఎంపీటీసీ సభ్యుడు మైనపు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ రాట్నాల సత్యనారాయణ, బేతాళ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ వెంటే మనమంతా..

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- పాందువ్వలో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు బ్రోచర్‌ను అందిస్తున్న పీవీఎల్

ఉండి: కుల,మత,రాజకీయాలకతీతంగా ప్రజలందరికీ మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే మనమంతా ఉండాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పాందువ్వలో రెండో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే ప్రజలెవ్వరూ ఇంతటి సంక్షేమాన్ని చూడలేదని అన్నారు. అర్హత గల ప్రతి ఇల్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గడిచిన నాలుగేళ్లల్లో రూ.4 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు లబ్ధి పొందారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి దొంగలు, మోసగాళ్ళు గ్రామాల్లోకి వస్తున్నారని, ఇంత వరకు ప్రజలకు మోహం చూపించలేని వాళ్ళు ఇప్పుడు వచ్చి ప్రజలకు అంది చేస్తాం ఇది చేస్తాం అని చెబుతున్నారంటే వారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు రాంబాబురాజు, ఏఎంసీ డైరెక్టర్ గుండు నాగేశ్వరరావు, గొంతే హరీష్, సోడదాసి శ్రీనివాస్, గాతల వెంకన్న, కంద్రిక రాంబాబు పాల్గొన్నారు.

చదువును ఆహ్లాదంగా మలుచుకోవాలి

కాళ్ల: విద్యార్థులు టైమ్ మేనేజ్‌మెంట్‌తో చదువును ఆహ్లాదకరంగా మలుచుకోవాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు సూచించారు. మండలంలోని కోపల్లె ఉన్నత పాఠశాలలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఉన్నత్ భారత్ అభియాన్ సంయుక్త ఆధ్వర్యాన విద్యార్థులకు ఓరియన్‌టేషన్ తరగతులు గురువారం నిర్వహించారు. కో ఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వరి అధ్యక్షత వహించగా ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుని ఛాలెంజ్‌గా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి 56వ శరన్నవరాత్రి మహోత్సవాలు ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య యువజన సంఘం, వర్తక సంఘం అధ్యక్షుడు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, మందిర చైర్మన్ జూలూరి వెంకటేశ్వరరావు తెలిపారు. 15న ఉదయం అమ్మ వారి గ్రామోత్సవంతో దస రా మహోత్సవాలు ప్రారంభమవుతాయని, ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో యువజన సంఘం కార్యదర్శి మండవిల్లి శివ సాయి నవీన్, కోశాధికారి వబిలిశెట్టి కిషోర్, మండ చంద్రశేఖర్, బోండా నిషాంత్, సమయమంతుల రవిప్రసాద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ఏఎంసీల సహకారం

ఉండి: వ్యవసాయ మార్కెట్ యార్డులు(ఏఎంసీ) రైతు సంక్షేమానికి మరింత సహకారంగా ఉన్నాయని ఉండి ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, చేకూరి రాజా నరేంద్రకుమార్ అన్నారు. గురువారం ఉండి ఏఎంసీ నూతన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై సభ్యులు చర్చించారు. చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్ యార్డుల బలోపేతానికి, వాటి ద్వారా రైతు సంక్షేమానికి, కనీస మౌలిక వసతుల కల్పనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో చర్యలు చేపడుతున్నారన్నారు. జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉండి ఏఎంసీ నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్‌లు గుండు నాగేశ్వరరావు, నిమ్మల సత్యనారాయణ, కానుబోయిన నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

పాలకోడేరు: దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. విస్సాకోడేరు పంచాయతీ పరిధిలోని వంకాయలపాలెం గ్రామానికి చెందిన కందులపాటి నాగ సాయి అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన బొల్లం వెంకటేష్ జులై నెలలో చేతి కడియంతో ముక్కుపై గుద్దడంతో గాయమైంది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం వెంకటేష్‌ను అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

వృద్ధులకు పౌష్టికాహారం

భీమవరం అర్బన్: భీమవరం మండలం తాడేరు గ్రామంలోని జద్దు బ్రహ్మాజీ వృద్ధాశ్రమంలో గురువారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా కోడె వీరమ్మ సేవా సమితి ఆధ్వర్యాన సమితి అధ్యక్షుడు కోడె యుగంధర్, విజయలక్ష్మి దంపతులు వృద్ధులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేరిచర్ల సత్యనారాయణ, కట్టా రవి, గంటా సుందర్‌కుమార్, గాదిరాజు రామరాజు, సాల శ్రీనివాస్, పులపర్తి స్వామి, కొత్త ధర్మ పాల్గొన్నారు.

నేడు ఉప్పులూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

ఉండి: మండలంలోని ఉప్పులూరులో శుక్రవారం ఉదయం 9:30 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి పాందువ్వలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడో రోజు కొనసాగుతుందని, డీసీసీబీ చైర్మన్ నర్సింహరాజు ఆధ్వర్యాన జరిగే ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.